క్లుప్తంగా

ఘనంగా మాతృభాషా దినోత్సవం



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు తీయనైన భాష అని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. పలు పాఠశాలల్లో తెలంగాణ భాష గొప్పదనం గురించి ఏకపాత్రాభినయం, సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో సంగ్రాం, దాశీరాం తదితరులున్నారు.

మాతృభాషపై విధేయత చూపాలి



కామారెడ్డి టౌన్ : ప్రతి ఒక్కరూ మాతృభాషపై విధేయతను చూపుతూ ఇతర భాషలపట్ల ఆదరణ చూపాలని కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. కిష్టయ్య అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషలో బోధన విద్యార్థికి సరియైన వ్యక్తిత్వాన్ని, సంస్కృతి, వారసత్వాలపై చక్కని అవగాహన కల్గిస్తుందన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆంగ్లభాషతో సమానంగా మాతృభాషల్లో కూడా అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో అకాడమిక్ కో–ఆర్డినేటర్ విశ్వప్రసాద్, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్, హిస్టరీ విభాగపు అధ్యక్షులు జయప్రకాశ్, అధ్యాపకులు సత్యనారాయణ, రాములు, మానస, ఫాతిమా, ఆఫ్రీన్, శ్రీలత, రవి, మల్లేష్, బాలాజి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



ఎల్లారెడ్డి: పట్టణ ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ వైద్యులు హరికిషన్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 134 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. వీరిలో 62 మందికి కంటి అద్దాలు, ఇద్దరిని కంటి ఆపరేషన్ల కోసం రిఫర్ చేయడం జరిగిందన్నారు. వైద్యులు సంజయ్, క్రాంతి తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



బాన్సువాడ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని బీఎస్పీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యాటకారి సాయన్న అన్నారు. శుక్రవారం బాన్సువాడలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో విద్య వ్యవస్థను బలోపేతం చేస్తాన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో 30 ఏళ్ల సర్వీసు ఉందన్నారు. 2009, 2013, 2014లో తనకు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గంగాధర్, ఈశ్వర్, పాండు, జగన్‌మోహన్, లక్ష్మియాదవ్, హీరాలాల్, నర్సింలు, ఖలీల్, సాయిలు తదితరులున్నారు.

ఉపాధ్యాయుడిని సర్వీస్ నుంచి తొలగించాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు రమేష్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఏబీవీపీ గాంధారి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ సతీష్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే అసభ్యంగా ప్రవర్తిస్తే విద్యార్థినులకు రక్షణ ఎక్కడుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

వేతన అవస్థలు

- ఈ- పంచాయతీ ఆపరేటర్లకు ఆరు నెలలుగా రాని జీతాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి
- పట్టించుకోని అధికారులు



జిల్లా పంచాయతీ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లు (ఫైల్)

రాజంపేట : గ్రామపంచాయతీ కార్యకలాపాలు, నిర్వహణను కంప్యూటరీకరణ చేసే ఈపంచాయతీ ఆపరేటర్లకు గత ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులెవరూ తమను పట్టించుకోవడం లేదని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 65 మంది ఆపరేటర్లు..

జిల్లాలో 526 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జీపీల్లో రోజువారీ కార్యకలాపాలు, జనన, మరణ సర్టిఫికెట్లు, ఇతర నిర్వహణ అంతా కంప్యూటరీకరణ చేసేందుకు 65 మంది కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. దాదాపు 10 ఏళ్లుగా వీరు విధులు నిర్వహిస్తుండగా, గ్రామపంచాయతీల ద్వారానే వేతనాలు చెల్లిస్తున్నారు. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ఏడాది కాలంగా కేంద్రం నుంచి ఆర్థిక సంఘం, రాష్ట్రం నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రావడంలేదు. అప్పటినుంచి ప్రతినెలా వేతనాలు అందక ఆపరేటర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెరిగిన పనిభారం..

గతంలో మేజర్ గ్రామపంచాయతీకి ఒకరిని నియమించుకుని వారి ద్వారా రెండు జీపీల చొప్పున కార్యకలాపాలు కంప్యూటరీకరించేవారు. తర్వాత కాలంలో కొంతమందిని తొలగించి, ఎంపీడీవో కార్యాలయాల్లో ఒకే దగ్గర కంప్యూటరీకరించేలా ఏర్పాట్లు చేశారు. ఈవిధులతో పాటు ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాల ఆర్జీదారుల, లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియ పంచాయతీ ఆపరేటర్లే నమోదు చేస్తున్నారు. దీంతో వీరిపై పని భారం పెరిగింది. ప్రస్తుతం ఐదు నుంచి ఆరు జీపీలకు ఒక ఆపరేటర్ విధులు నిర్వర్తిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయ పనులు కూడా వీరితోనే చేయిస్తున్నారు. దీంతో ఒకవైపు పంచాయతీల నిర్వహణ భారమైంది. ఒక్కొక్కరికి రూ.22750 చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. 6 నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు బకాయి వేతనాలు అందించి, నెలానెలావేతనాలు చెల్లించాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

“ వేతనాలు అందించాలి



జిల్లాలలోని ఈ పంచాయతీ ఆపరేటర్లకు 6నెలలుగా వేతనాలు రావడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లాం. ఆపరేటర్లు అప్పులు చేసి కుటుంబ పోషణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీ రాజ్ కమిషనర్ స్పందించి ఆపరేటర్లకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించేలా చూడాలి. దీంతో పాటు ప్రతి నెలా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– తాటి శంకర్, జిల్లా ఈ పంచాయతీ ఆపరేటర్ల ప్రెసిడెంట్

పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి



ఎంపీడీవో రాజేశంకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రాజంపేట: మండలంలోని గ్రామ పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో రాజేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకవర్గం పదవీ కాలం ముగిసిన నుంచి పంచాయతీల నిర్వహణ భారం తమపై పడిందన్నారు. గ్రామాలలో పారిశుధ్య పనులు, ట్రాక్టర్ నిర్వహణ, తాగు నీటితో పాటు తదితర పనులకు నిధులు లేక అప్పులు చేస్తూ పంచాయతీ నిర్వహణ చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు తలెత్తె అవకాశం ఉన్నందున ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు



బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రారంభించి 25సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వారికి త్వరలో నిర్వహించే రజతోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ప్రిన్సిపల్ డా.వేణుగోపాల స్వామీ తెలిపారు. వారం రోజుల పాటు క్రీడాపోటీలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు క్రీడాపోటీల్లో ఉత్సాహంగా పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మల్లికార్జున దేవాలయం నూతన కమిటీ ఎన్నిక



తాడ్వాయి(ల్లారెడ్డి): మండలంలోని బ్రహ్మాజివాడిలో గల మల్లికార్జున (మల్లన్న)దేవాలయం నూతన నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్రొల్ల ఆశయ్య, ఉపాధ్యక్షుడిగా చిన్నగొల్లసాయిలు, కర్రొల్ల ఎల్లయ్య, కార్యదర్శులుగా గాజె పర్వయ్య, శెట్పల్లి శ్రీకాంత్, కోశాధికారిగా పెద్దగొల్ల గంగరాజు, సలహాదారులుగా శెట్పల్లి లింగం, కర్రొల్ల స్వామి, మోతె ఎల్లయ్య, చిన్నగొల్ల బాలురాజు, శెట్పల్లిచిన్న సాయిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నీటిని పొదుపుగా వాడాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఈ వెంకటేశ్

రాజంపేట: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటిని పొదుపుగా వాడే విధంగా చూడాలని మిషన్ భగీరథ క్వాలిటీ కంట్రోల్ డీఈ వెంకటేశ్ అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలకు మరమ్మతులు, వాటర్ ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ వంటి పనులను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొత్త ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. క్వాలిటీ కంట్రోల్ ఏఈ సత్యనారాయణ, మిషన్ భగీరథ ఏఈ రజిత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న హైమారెడ్డి



బ్రహ్మజివాడిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జిల్లాలో ఊపందుకుంది. శుక్రవారం పట్టణ బీజేపీ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి హైమారెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్క పట్టభద్రుడిని కార్యకర్తలు కలిసి బీజేపీ అభ్యర్థులకు ఓటు వేయించేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్ఎన్‌రెడ్డి, నర్సింలు, బాలకిషన్, రాజేష్, దేవేందర్ తదితరులున్నారు.

దోమకొండ : మండల కేంద్రంతో పాటు సంఘమేశ్వర్ గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని కోరుతూ వారు ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి కుంట లక్ష్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రహ్మాజివాడి, దేవాయిపల్లి గ్రామాలలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరెందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఓటు వేయాలని ఓటర్లను కోరారు. నాయకులు రాజీవ్‌కుమార్, అఖిల్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్(జుక్కల్): బీజేపీ మండల అధ్యక్షుడు తుకారం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ చేపడుతున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సంతోష్ తదితరులున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మండ్లు స్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా నాయకులు ప్రచారం నిర్వహించారు.

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో బీజేపీ పార్టీ 25 ప్రభారిల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి టీచర్స్ ఎమ్మెల్సీ జిల్లా ఇన్‌చార్జీ జయశ్రీ పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరుణతార, పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు. అలాగే మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గంగాధర్, గోపాల్‌రెడ్డి, రాజు పటేల్, ఆశోక్, రవి కార్యకర్తలున్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాల తనిఖీ



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలను శుక్రవారం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్ తనిఖీ చేశారు. పాఠశాలలో భోజనశాలను, స్టోర్ రూం, విద్యార్థుల పడక గదులను పరిశీలించారు. భోజన సౌకర్యాలు, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

28వ సారి రక్తదానం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు జమీల్ హైమద్ 28వ సారి రక్తదానం చేశారు. జీజీహెచ్ ఆస్పత్రిలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న 24 ఏళ్ల శిల్పకు 'బీ' పాజిటివ్ రక్తం అత్యవసరం కాగా జమీల్ హైమద్ స్పందించి శుక్రవారం రక్తదానం చేసి అందజేశారు. కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలు, ఉపాధ్యాయుడు సాధిక్ అలీ, సంతోష్, ల్యాబ్ టెక్నీషియన్ అమర్‌లు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కొండాపూర్ శివారులో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొండాపూర్, ముంబోజిపేట, భవానిపేట, జల్దిపల్లి, తదితర గ్రామాల శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీవో నరేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. అలాగే నర్సరీ, కంపోస్టు షెడ్డు, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఉపాధి పనులు కొలతల ప్రకారం చేయాలని, కూలీలకు డబ్బులు గిట్టుబాటు వచ్చే విధంగా పనులు చేపట్టాలన్నారు. నర్సరీలలోని మొక్కలకు ప్రతి రోజు నీరు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఏ సాయాగౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలి

వేసవిలో మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు, తండాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు రాని రోజుల్లో గ్రామాల్లో ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలోని నర్సరీలో పెంచుతున్న మొక్కలతోపాటు పల్లెప్రకృతివనంలో పెరుగుతున్న మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. మండలంలోని మాల్తుమ్మెద గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పల్లెప్రకృతివనం, నర్సరీతోపాటు కంపోస్ట్ షెడ్డును ఆయన పరిశీలించారు. కంపోస్ట్ షెడ్డులో తడిచెత్త, పొడి చెత్తను వేరుచేసి నిల్వ చేయాలన్నారు. అనంతరం పల్లెప్రకృతివనంలోని మొక్కల చుట్టూ గుంతలను చేసి క్రమం తప్పకుండా నీటిని పట్టించాలన్నారు. నర్సరీలో మొక్కలను ఎండవేడిమి నుంచి రక్షించాలని సూచించారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి అశోక్ ఉన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. గురువారం నాటికి 3లక్షల 10వేల 264 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

ఆధ్యాత్మికం

నల్లపోచమ్మ ఆలయంలో హోమం



బాన్సువాడ : పట్టణంలోని బేతాళస్వామి ఆలయం వద్ద నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా శుక్రవారం హోమం నిర్వహించారు. నల్లపోచమ్మ విగ్రహ ఆవిష్కరణ పురస్కరించుకుని మూడు రోజుల పాటు హోమం, విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వచ్చే నెల 2న బోనాల పండుగ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చించోలిలో బోనాల పండుగ

బీర్కూర్ మండలంలోని చించోలి గ్రామంలో శుక్రవారం బారడి పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉన్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు..


సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి బోనాల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంటికోక బోనం చొప్పున తీసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరిమాత దివ్య సమాధి, ప్రతిమ, చిత్రపటం, పాదుకలను రకరకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయితో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బద్దిపోచమ్మ–ముత్యాలమ్మ ఆలయాలు ప్రారంభం



భిక్కనూరు : మండలకేంద్రంలోని పాత దళితవాడలో బద్దిపోచమ్మ–ముత్యాలమ్మ ఆలయాలను మాజీ సర్పంచ్ తున్కి వేణు శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఈ రెండు ఆలయాలను అమ్మవార్ల కృపతో నిర్మింపజేశానన్నారు. వేదబ్రహ్మణుల మంతోచ్ఛరణాల మధ్య విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నేతలు అందే మహేందర్ రెడ్డి, బోండ్ల రాంచంద్రం, సరస్వతి ప్రభాకర్, అంబల్ల మల్లేషం, సత్తురి బాల్‌రాజు, శ్రీనివాస్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

వైభవంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని సంతోషి మాత ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టూ పక్కల గ్రామాల మహిళలు, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, నవగ్రహ గణపతి పూజ, యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అర్చకురాలు చెట్టివార్ సంతోష్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు తుల్జా భవాని మాత వార్షికోత్సవం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాలోత్ సంగ్యానాయక్ తండాలో శనివారం తుల్జా భవాని మాత వార్షికోత్సం నిర్వహించనున్నట్లు తండా వాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తం

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

మాచారెడ్డి: మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన మారుపాక రాములు తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి శుక్రవారం సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్పీ కమల్ కిషోర్ మాట్లాడుతు క్యాంపులో భాగంగా ఇక్కడికి వచ్చిన వైద్యురాలు సారిక ఎనిమిదిమంది దివ్యాంగ చిన్నారులకు పరీక్షలు నిర్వహించారన్నారు. చిన్నారులు ఇంటి వద్ద చేసే వ్యాయామం గురించి ఆమె విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన కాంప్లెక్స్ హెచ్‌ఎం

పిట్లం(జుక్కల్): మండలంలోని చిల్లర్గి గ్రామ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం రాంపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీలత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో నమోదు చేస్తున్న అపార్ ఐడీ పనులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎఫ్ఏ 4 పరీక్షలు నిర్వహించాలని, మార్కులను ఆన్ లైన్‌లో నమోదు చేయాలని పాఠశాల సిబ్బందికు సూచించారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హేమలత, సిబ్బంది శ్రీనివాస్, విఠల్, నవీన, ఆ ప్రాంత క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గోపాల్ సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విరాళం

మాచారెడ్డి : మండలంలోని అక్కాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్తులు విరాళాలు సేకరించారు. శుక్రవారం మాచారెడ్డి ఎస్సై అనిల్ సమక్షంలో టెక్నిషియన్‌కు అందజేశారు. సీసీ కెమెరాల ఆవశ్యకతపై నిర్వహించిన కళాప్రదర్శనకు స్పందించిన గ్రామస్తులు సీసీ కెమెరాల కోసం రూ.30 వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్, గ్రామస్తులు బాల్‌చంద్రం, ఎల్లయ్య, విజయ్‌రెడ్డి, గడ్డం బాబు తదితరులున్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు పంటలపై అవగాహన కల్పించారు. రైతులు పంటలను ఎలా పండిస్తారు.. పంటలు చేతికి ఎలా అందుతాయి.. దానికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు అనే విషయాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం మహారాష్ట్ర సరిహద్దులోని హోట్టల్ శివాలయాన్ని విద్యార్థులు సందర్శించారు.

రామ్ రెడ్డికి జాతీయ సేవా పురస్కార అవార్డు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రానికి చెందిన యోగా శిక్షకుడు రామ్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ సేవా పురస్కార అవార్డును అందుకున్నారు. శివాజీ జయంతి సందర్భంగా శివాజీ సేవా సమితి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జిల్లా నుంచి పాల్గొన్నారు.గత 25 ఏళ్లుగా ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తూ, రాష్ట్రంలోనే అత్యధికంగా యోగా ట్రైనింగ్ సర్టిఫికెట్‌లు పొందిన జిల్లాగా గుర్తింపుకు గాను ఈ అవార్డును అందజేసినట్లు రామ్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి ఎస్ఎస్‌వై కేంద్ర సభ్యులు అంజయ్య, రఘుకుమార్, సిద్ధాగౌడ్, లక్ష్మీపతి యాదవ్, వెంకటేశం, హిమబిందు, మంగమ్మ, సాయిసుధా రామ్‌రెడ్డిని సన్మానించారు.